క్లుప్తంగా

పాఠశాలకు వంట పాత్రల అందజేత



కొత్తకోట రూరల్: వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సమకూర్చిన వంట పాత్రలను పెద్దమందడి మండలంలోని అమ్మపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన వంట ఏజెన్సీ మహిళ పద్మమ్మకు కాంగ్రెస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, ఆంజనేయులు, బాలు, యాదగిరి, శంకర్ గౌడ్, బాలరాజు, పంచాయతీ సెక్రెటరీ మధుగౌడ్, ప్రధానోపాధ్యాయులు శశివర్ధన్, రవికుమార్, సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నారంలో కూలిన ఇల్లు



పాన్‌గల్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు, వంకలు, చెరువులు అలుగులు పారుతున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పాత, శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోతున్నాయి. మంగళవారం మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన తెలుగు ఎల్లమ్మకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిన ఇళ్లను ఆర్ఐ మహేష్ పరిశీలించి వివరాలను సేకరించారు.

ఆశాలకు కనీస వేతనం అందించాలి

సాక్షి, నెట్‌వర్క్: ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పీహెచ్‌సీ, ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లు కొత్తకోట పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణి, పాన్‌గల్ పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిభారం పెరిగిందని, మూడేళ్లుగా యూనిఫాం ఇవ్వడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునీత, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జనంపల్లి భాగ్య, అధ్యక్షురాలు మంజుల, పుష్ప, సంతోష, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, రేణుక, మహేశ్వరి పాల్గొన్నారు.

సోళీపురం పెద్ద చెరువు పరిశీలన

ఖిల్లాఘనపురం: సోళీపురం పెద్ద చెరువును మంగళవారం ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు పరిశీలించారు. చెరువు అలుగుకు అడ్డంగా కొందరు రైతులు వరి నాటడంతో చెరువులో నీటి నిల్వ పెరిగి లోపలి భాగంలో వరి పైరు నీటిలో మునిగింది. ఈ విషయంపై సోమవారం పలువురు రైతులు తహసీల్దార్ సుగుణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఈఈ మంగళవారం చెరువు అలుగును పరిశీలించారు. రైతుల ఖర్చుతోనే కొంత అలుగు భాగంలో ఉన్న మట్టిని జేసీబీల సహాయంతో తీయించారు.

బంద్ కరపత్రాలు విడుదల

వనపర్తిటౌన్: జాతీయ మాలల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ నెల 22న ఓయూ జేఏసీ బంద్ పాటించనున్నట్లు సంఘం ఉపాధ్యక్షుడు కరుణాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో బంద్ కరపత్రాలను విడుదల చేశారు. బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాదారి రఘురాం, బండారి రాజ్‌కుమార్, చంద్రశేఖర్ ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొత్తకోట: ఉపాధ్యాయ ఉద్యోగస్తులకు ఆశనిపాతంగా మారిన సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి పాత ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూ సంఘం నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘమైన పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహాధర్నాను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, స్టేట్ అసోసియేటెడ్ అధ్యక్షుడు భక్తరాజు, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, గోపాల్, బాలరాజు, రాములు, సురేష్, మాధవ ఉన్నారు.

ఆర్జేడీకి వినతి

వనపర్తి విద్యావిభాగం: ఉపాధ్యాయులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తపస్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని తగ్గించాలి, 60మంది విద్యార్థులు పైబడిన పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ ఉన్నారు.

పోచమ్మ తల్లీ.. కరుణించుమా





కదుకుంట్లలో బోనాలతో ఊరేగిస్తున్న మహిళలు, గ్రామస్తులు

సాక్షి, నెట్‌వర్క్: అమ్మా బైలెల్లినాదే.. పోచమ్మ తల్లీ బైలెల్లినామే.. అంటూ మహిళలు జిల్లావ్యాప్తంగా బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కుండలో తయారు చేసిన ప్రత్యేక వంటకాన్ని తయారు చేశారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనం కుండను అలంకరించిన మహిళలు గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. మరికొందరు కోళ్లు, పొట్టేళ్లు కోసి మొక్కులు తీర్చుకున్నారు. తమ పిల్లలను ఆశీర్వదించడంతో పాటు పాడి, పంటలు సమృద్ధిగా ఉండేలా చూడాలని వేడుకున్నారు.

❑ జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చింతలహనుమాన్ ఆలయ సమీపంలో ఉన్న పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్వేతానగర్, భగత్‌సింగ్‌నగర్, హై స్కూల్ రోడ్డు, పాతబజార్, బ్రహ్మంగారి వీధి, బండారునగర్, మారెమ్మకుంట, తదితర ప్రాంతాల నుండి మహిళలు తరలివచ్చారు.

❑ కొత్తకోట మండల కేంద్రంతో పాటు అమడబాకుకల, సత్యహళ్లి, నిర్వేన్, భూత్కూర్, కానాయపల్లి గ్రామాల్లో బోనాల పండుగను కనులపండువగా నిర్వహించారు.

❑ వీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో మహిళలు సుంకులమ్మ దేవతకు బోనాలతో నైవేద్యం సమర్పించారు.

❑ పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, దావాజిపల్లి, గోప్లాపూర్, బహదూర్‌గూడెం, అన్నారం, బుసిరెడ్డిపల్లి, జమ్మాపూర్ తదితర గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.

❑ వనపర్తి మండలంలోని కదుకుంట్ల, చిట్యాల, పెద్దగూడెం, పెబ్బేరు మండలంలోని సూగూరు, కొత్తసూగూరు, శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు నాగరాలలో పోచమ్మ దేవత బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

❑ ఖిల్లాఘనపురం మండలంలోని పర్వతాపురం, మల్కిమియాన్‌పల్లి, గట్టుకాడిపల్లి, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనంతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



పాన్‌గల్‌లో..



కొత్తకోటలోని పోచమ్మ గుడి వద్ద



గోవర్ధనగిరిలో..



కొత్తకోటలో బోనంతో వెళ్తున్న కుటుంబం



కొత్తకోటలో..



అమడబాకులలో..



జిల్లాకేంద్రంలో బోనంతో కదిలిన మహిళలు



గట్టుకాడిపల్లిలో..

ప్రాణనష్టం నివారణకు పకడ్బందీ చర్యలు



రామన్‌పాడు జలాశయం వద్ద ఇన్‌చార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి

వనపర్తి : జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు, చెరువులు, కాల్వలు పొంగిపొర్లుతున్నందున ఎలాంటి ప్రాణనష్టం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె సరళాసాగర్, రామన్‌పాడ్ ప్రాజెక్టులను సందర్శించి సైఫన్లు, క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద ఉధృతిని పరిశీలించారు. సరళాసాగర్‌కు వరద ఎక్కడి నుంచి వస్తుంది.. దిగువకు పారే నీరు ఎక్కడికి చేరుతుంది.. కాజ్‌వేలు, కాల్వలు ఎక్కడెక్కడ పొంగిపొర్లుతున్నాయనే వివరాలు తెలుసుకొని ప్రజలు వాటిని దాటకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట పోలీస్ పహారా ఏర్పాటు చేయాలని.. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టిమిద్దెలు, ప్రహరీలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి వాటిని గుర్తించి కుటుంబాలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, నది పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ జగన్మోహన్, తహసీల్దార్లు జేకే మోహన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లాఘనపురం: జిల్లాలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులు తదితర వాటి గురించి ఇన్‌చార్జీ ఎస్ఐ జయన్నను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం అయితే తప్ప చిన్నపిల్లలను పొలాల వెంబడి పంపరాదన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. పలు దేవాలయాలకు ఇప్పటికే ప్రత్యేకంగా తయారు చేసిన తాళాలను అందించినట్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు ఈ ఏడాది 27 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. నిబంధనల ప్రకారమే వినాయక మండపాలు నిర్మించాలని సూచించారు.

ఫొటోగ్రఫీ సృజనాత్మక కళ..

వనపర్తి : చరిత్రను సజీవంగా నిలిపే ప్రత్యక్ష సాక్ష్యం ఫొటో.. ఫొటోగ్రఫీ ఓ సృజనాత్మక కళ అని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫొటో జర్నలిస్టులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోటి అక్షరాలతో చెప్పలేని భావాన్ని, విషయాన్ని ఫొటోతో చెప్పవచ్చన్నారు. ఫొటో జర్నలిజం నిజాన్ని కళ్లెదుట నిలిపే పదునైన ఆయుధమని అభివర్ణించారు. కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులు రాము, బాలరాజు, నవీన రమేష్, యూసుఫ్, యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్‌సింగ్, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆధునిక పద్ధతులతో మెరుగైన బోధన

వనపర్తిటౌన్: తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై తయారు చేసిన చార్ట్స్, మోడల్స్, వర్కింగ్ మోడల్స్‌తో విద్యార్థులకు మెరుగైన బోధన చేయవచ్చని ఆర్జేడీ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళాను మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. దాదాపు 58 పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన టీఎల్ఎంలతో మేళాకు హాజరయ్యారు. మేళాలో తెలుగు సబ్జెక్టులో మొదటి బహుమతి ఎంపీపీఎస్ అంజనగిరి, రెండో బహుమతి పెద్దగూడెం, మూడో బహుమతి నందిమల్ల గడ్డ, ఇంగ్లిష్‌లో మొదటి బహుమతి చిట్యాల, సెకండ్ హరిజనవాడ, ఎంపీపీఎస్ బుడగజంగం కాలనీ, మ్యాథ్స్‌లో ప్రథమ బహుమతి, కదుకుంట్ల, ద్వితీయ బహుమతి అచ్యుతాపూర్, తృతీయ బహుమతి బండారునగర్, ఈవీఎస్‌లో మొదటి బహుమతి పెద్దగూడెంతండా, రెండో స్థానంలో డీఏన్‌టీ తండా, మూడో బహుమతి ఎంపీపీఎస్ తెలుగువాడ పాఠశాలలు దక్కించుకున్నట్లు న్యాయ నిర్ణేతలు జితేందర్, నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మద్దిలేటి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గురురాజ్ యాదవ్, గణేష్ కుమార్, చంద్రశేఖర్, వరలక్ష్మి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కొండపురం బాలరాజు నేతృత్వంలో మండలంలోని పాఠశాలలకు చెందిన అధ్యాపకులు బోధన సామగ్రిని నూతన పద్ధతులతో వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, కమిషనర్ శశిధర్, అమరచింత ఎంఈఓ భాస్కర్‌సింగ్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మద్దిలేటి, కృష్ణ, జీహెచ్‌ఎంలు రాజేంద్రప్రసాద్, అనంతరాములు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో టీఎల్ఎం మేళాలో పాల్గొన్న ఆర్జేడీ విజయలక్ష్మి

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి ఊరేగింపు

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పెద్దమందడి వారి ఆధ్వర్యంలో మండలంలోని వీరాయిపల్లిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఈ నెల 16న గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాలుగు రోజుల పాటు భక్తులచే విశిష్ట పూజలందుకున్న శ్రీకృష్ణ భగవానుడిని మంగళవారం ఊరేగించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు రమేష్, భాస్కర్, జానకీరాముడు, నీలన్న, తిరుపతయ్య, శ్రీను, సాయిలు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లి, మానాజీపేట గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16న ఉప్పరిపల్లిలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు స్వామివారి వేడుకలను గ్రామంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, శ్రీకృష్ణుడి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో తిర్మలేష్, శేఖర్, భాస్కర్‌రెడ్డి, పురుషోత్తం, నాగ్యానాయక్, బాలకృష్ణ, రాఘవేందర్, రామచంద్రయ్య, లక్ష్మి, శైలజ, రేణుక, సేజాత, జ్యోతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



వీరాయిపల్లిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

బీమాను వినియోగించుకోవాలి

కొత్తకోట రూరల్: జన సురక్ష పథకాల సేవలపై యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కొత్తకోట, రేవల్లి, వెంకటాయపల్లి, సత్యహళ్లి, గౌరిదేవినిపల్లి, ఘణపురం గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన ఖాతాదారులు తప్పనిసరిగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) వంటి పథకాలల్లో చేరాలన్నారు.

కనిమెట్ట యువకుడికి గోల్డ్ మెడల్

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన ముంత రమేష్ ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవ వేడుకల్లో తెలుగు శాఖలో సంప్రదాయ సాహిత్యం – పాఠ్యాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. గ్రామీణ వాతావరణంలో చదువుకున్న రమేష్ పట్టుదలతో తన ప్రతిభను నిరూపించుకోవడం అందరికీ ఆదర్శప్రాయంగా నిలవడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ రమేష్‌ను అభినందించారు.

పీహెచ్‌డీ ప్రదానం

వనపర్తిటౌన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జి.సుష్మ ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

చిన్నంబావి: మండలంలోని దగడపల్లికి చెందిన గుజుల పరమేష్ ఉస్మానియా యూనివర్సిటీలో మొబైల్ అడ్హాక్ నెట్‌వర్క్‌లో చేసిన పరిశోధనలకుగాను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేశారు.

చరిత్రకు సజీవ సాక్ష్యం ఫొటోగ్రఫీ

సాక్షి, నెట్‌వర్క్: చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఫొటోలు నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయీస్ డాగురే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు ఆస్పత్రుల్లో రోగులకు, అనాథ శరణాలయాల్లో చిన్నారులు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కొత్తకోట, మదనాపురం మండలాల ఫొటోగ్రాఫర్ యూనియన్ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, ఫొటోగ్రాఫర్స్ గోపాల్, వంశీ, శ్రీను, అంజి, వెంకటేశ్వర్లగౌడ్, గోపి, శ్రీరాములు, శ్రీనివాసులు, మన్యం, నవీన శ్రీను, ఈశ్వరయ్యగౌడ్, బురాన్, నరేష్, సురేష్, వెంకట్, మైబు, రహీం, నాగమల్లయ్య ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: మండలంలోని గిరిజనతండాలతో పాటు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అన్నారంతండా, అన్నారం గ్రామాల్లో ఆయన పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాషానాయక్, శంకర్‌నాయక్, రవి, బాబు, సీతమ్మ పాల్గొన్నారు.

మంత్రివర్యా.. మొర ఆలకించరా!

- శిథిలావస్థలో బాలికల పాఠశాల
- 220 విద్యార్థినులకు నాలుగు తరగతి గదులే..
- భయం గుప్పిట్లోనే చదువులు



వరండాల్లో చదువులు కొనసాగిస్తున్న విద్యార్థినులు

అమరచింత: కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల తరగతి గదులకు తాత్కాలిక మరమ్మతులు చేసినా.. ఎప్పుడు కూలుతుందో అనే భయంతో విద్యార్థినులు చదువులను కొనసాగిస్తున్న దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తరగతి గదులు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇందిరమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా గత విద్యాసంవత్సరం రూ.8 లక్షలతో తాత్కాలిక మరమ్మతులతో పాటు విద్యుదీకరణ, తాగునీటి పైప్‌లైన్ పనులను చేపట్టింది. తమ పాఠశాలలో వసతులు లేవని, తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, పైకప్పు పెచ్చులూడుతున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల, జిల్లా విద్యాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతి గదులు మరింత అధ్వానంగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి వాకిటి స్పందించి పాఠశాలకు తరగతి గదుల నిర్మాణంతో పాటు మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భయంగా ఉంది



నా పేరు నందిని. కొంకన్‌వానిపల్లి నుంచి అమరచింతకు వచ్చి చదువుకుంటున్నా. ఆరో తరగతిలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు తరగతి గదుల పరిస్థితి అధ్వానంగానే ఉంది. తరగతి గదుల పైకప్పులు ఎప్పుడు కూలుతాయే అన్న భయంలో చదువులను కొనసాగిస్తున్నాం.

– నందిని, పదో తరగతి

వరండాలో నిల్చోలేక పోతున్నాం



పాఠశాలలోని వరండాలో కాసేపు నిల్చోలేని పరిస్థితి. ఇంటర్వెల్, మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదులకు వెళ్లి భోజనం చేస్తున్నాం. పాఠశాలకు సరైన వసతులు లేవు. మంత్రి, ఎంపీలు స్పందించి తమ పాఠశాలకు నిధులు మంజూరు చేయాలి. వర్షకాలం వచ్చిందంటే తమకు తరగతి గదుల్లో చదువుకోవాలంటే భయమేస్తుంది.

– లహరి, పదో తరగతి

ఉన్నతాధికారులకు విన్నవించాం



పాఠశాలలోని తరగతి గదుల పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు విన్నవించాం. తమ పాఠశాలను మొదటి విడతలో ఇందిరమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా రూ.8 లక్షలు మంజూరుచేసి తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేదు. సమస్యను పరిష్కరించాలంటూ ఉన్నాతాధికారులతో పాటు మంత్రి వాకిటి శ్రీహరికి విన్నవిస్తున్నాం.

– శారద, ఇన్‌చార్జి హెచ్‌ఎం, అమరచింత